రెచ్చిపోతున్న ఇసుకాసురులు

కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఇసుక పాలసీ అధికార పార్టీ నాయకులకు కల్పతరువుగా మారింది. ఉచిత ఇసుక మాటున ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఇసుక దోపిడీతో లక్షల రూపాయలు జేబులు నింపుకుంటోంది. అధికారులు అడ్డుచెబితే బెదిరించడం, అనుకూలంగా వ్యవహరిస్తున్న మరికొందరికి ముడుపులు ఇస్తూ క్వాలిటీ ఇసుక ఉన్న స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతాన్ని నిబంధనలకు పాతర వేసి, భారీ యంత్రాలతో తోడేస్తూ, స్వర్ణముఖికి గర్భశోకం కలిగిస్తోంది.

- యథేచ్ఛగా జేసీబీ, హిటాచీలతో తవ్వకాలు
- ఆపై కూలీలతో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్
- అధికారులు అడ్డుకుంటే బెదిరింపులు
- రూపురేఖలు మారుతున్న స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతం


నరసింగాపురం వాగులో జేసీబీతో ఇసుకను ట్రాక్టర్‌కు లోడింగ్ చేస్తున్న ఇసుకాసురులు

చంద్రగిరి: ఇళ్ల అవసరాలకు మాత్రమే ఇసుకను వినియోగించుకోవాలని, ఎక్కడా విక్రయించుకునేందుకు వీలు లేదని, యంత్రాలతో ఇసుకను తోడేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే రాష్ట్రంలోనే కాదు, చంద్రగిరిలో సైతం అధికార పార్టీ నేతలు నిబంధనలను తుంగలో తొక్కి, రెచ్చిపోతున్నారు. నరసింగాపురం, అగ్రహారం స్వర్ణముఖి వాగులో మూడు రోజులుగా జేసీబీ, హిటాచీల సాయంతో ఇసుకను తోడేస్తున్నారు. ఇప్పటికే స్వర్ణముఖి నదిలో భారీగా గోతులు ఏర్పడి బావులను తలపిస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే స్వర్ణముఖి నది తన రూపురేఖలు కోల్పోవడంతో పాటు నదికి ఆనుకుని ఉన్న బావుల్లో నీరు అడుగంటి పోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మొక్కుబడిగా దాడులు చేయడం తప్పితే ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయడం లేదనే విమర్శలొస్తున్నాయి.

ఒక్కో వాహనానికి కప్పం కట్టాల్సిందే..!

అధికార పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. అతడిని కాదని మరొకరు ఇసుకను తరలిస్తే వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులకు పంపించి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులు ఆ


అగ్రహారం వద్ద యంత్రాలతో ఇసుకను తోడేయడంతో చెరువులను తలపిస్తున్న స్వర్ణముఖినది

యువనేతతో సిండికేట్‌గా ఏర్పడి ఇష్టానుసారంగా ఇసుకను విక్రయిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. కూతవేటు దూరానికి ఇసుకను రవాణా చేయాలన్నా సుమారు రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు రోజుకు రూ.వెయ్యి చొప్పున, పది రోజులకోసారి రూ.10వేలను ఆ యువనేతకు ఇస్తున్నట్లుగా తెలిసింది. ఆ సొమ్ములో సంబంధిత శాఖ అధికారులకు వాటా ఇస్తూ, మిగిలిన సొమ్మును పార్టీ పేరుతో కాజేస్తున్నట్లుగా స్వంత పార్టీ వారే విమర్శిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

అధికారులంటే లెక్కలేనితత్వం..!

నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో, ఘటన స్థలానికి వెళ్లిన కొంత మంది రెవెన్యూ అధికారులను, అధికార పార్టీకి చెందిన నేతలు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడటంతో నిస్సహాయులవుతున్నారు. గత ఐదేళ్ల కాలంలో ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదని, ఇలా అయితే చంద్రగిరిలో విధులు నిర్వహించలేమని వాపోతున్నారు.


నరసింగాపురం వద్ద ఇసుకను తరలిస్తున్న దృశ్యం

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

స్వర్ణముఖి వాగులో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఇటీవల దాడులు చేసి జేసీబీలు, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను రవాణా చేస్తే సహించేది లేదు. అధికారులపై బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

– శివరామ సుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి

క్లుప్తంగా

అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభం


జెండా ఆవిష్కరిస్తున్న బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, బ్యాంకు అధికారులు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని కో–ఆపరేటివ్ సహకార బ్యాంకులో గురువారం 71 అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యారు. బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార బ్యాంకు పాత్ర ఉంటుందన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఎండీ శివకుమార్‌రెడ్డి, డైరెక్టర్లు నాదమునిరెడ్డి, అమరనాథరెడ్డి, సురేష్ కుమార్‌రెడ్డి, చంద్రయ్య, సి.రమేష్, దొరబాబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రికి డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ సైకాలజీ విభాగ పరిశోధక విద్యార్థిని మిర్యాల గాయత్రికి ఆ వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ప్రొఫెసర్ ఎస్ విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ ట్రస్ట్, వెల్‌బీయింగ్ అండ్ లైఫ్ శాటిస్‌ఫాక్షన్ ఆన్ మిరుచువల్ అడ్జస్ట్‌మెంట్ అమాంగ్ వర్కింగ్ అండ్ నాన్ వర్కింగ్ ఉమెన్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తా


అశోక్ కుమార్

చంద్రగిరి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని కొటాలకు చెందిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సంఘం నూతన ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు. తనను నూతన ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా బాబురావు నియమించారని చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎస్సీ, ఎస్టీల సమస్యలపై పోరాటం చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా పాటు పడతానని పేర్కొన్నారు.

వరి, మామిడి రైతులకు అవగాహన

ఖాకరాపేట: వరి, మామిడి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం అధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో జరిగిన రైతు అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. విత్తన ఎంపిక, మామిడిలో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓలు ధనలక్ష్మి, ఖాదర్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం 'ప్రజా పోరు'

పాకాల: నానాటికీ పెరుగుతున్న నిత్యావసర ధరలు, దళితులపై జరుగుతున్న దాడులు, అలాగే మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులను ప్రభుత్వం అరికట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ నిత్యానందబాబుకు వినతి పత్రం ఇచ్చారు. ప్రజా పోరులో భాగంగా గురువారం సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్‌రావు పై విధంగా విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో మోటర్లకు మీటర్లు బిగించరాదని అడ్డుకున్న నారా లోకేష్ అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచి బాదుడు మొదలు పెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ ప్రసాద్, గ్రామిక మహిళా కన్వీనర్ సుగుణమ్మ, రైతు నాయకులు చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరుకు చెత్తకుండీల వితరణ

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పంచాయతీలో చెత్త సేకరణకు గురువారం లక్కీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50వేల విలువైన 5 ఇనుప చెత్త కుండీలను ట్రస్టీ జాయింట్ మేనేజర్ త్రిపుర వార్డు సభ్యుడు లోకేష్‌కు అందజేశారు. ట్రస్ట్ గౌరవ సలహాదారుడు సాయిరాం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకే లక్ష్యం : మౌర్య


మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో తిరుపతి ఉత్తమ ర్యాంకు సాధించడమే లక్ష్యంగా అందరూ పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో గురువారం కమిషనర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంవత్సరం నిర్వహించే పోటీల్లోనూ తిరుపతి ఉత్తమ స్థానం సాధించేలా అందరు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వాటర్ ప్లస్ పోటీలలో, చెత్త రహిత నగరాల్లో ఇచ్చే సెవెన్ స్టార్ రేటింగ్ లోనూ ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు, టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారులపై విచారణ

తిరుపతి తుడా: కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరు టీడీపీ నాయకులు అధికారులపై కక్షగట్టి వరుస ఫిర్యాదులు చేశారు. వీటిపై స్పందించిన ప్రభుత్వం విచారణలకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో విచారణ నిమిత్తం వచ్చింది. ఆ నేతల ఫిర్యాదుల ఆధారంగా కొంతమందిపై విచారణ మొదలెట్టారు. ఆ అధికారుల హయాంలో చేసిన పనులపై ఆరా తీశారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్యతో పాటు రెవెన్యూ అధికారులు విచారణలో పాల్గొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో కల్యాణదుర్గం, ప్రొద్దుటూరు, పుత్తూరు కమిషనర్లు విచారణ కమిటీ సభ్యులుగా హాజరయ్యారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

–గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో డీవైఈఓ


నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీవైఈఓ బాలాజి


పాకాల: గ్రంథాలయ వారోత్సవాల్లో దామలచెరువు వాసులు

తిరుపతి అర్బన్: పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన సాధ్యమని, ఆ దిశగా గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి బాలాజి పిలుపునిచ్చారు. గురువారం ఆయన తిరుపతిలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలను ప్రారంభించారు. తొలుత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించి మాట్లాడారు. స్వాతంత్య్ర సంగ్రామం, నవభారత నిర్మాణంలో నెహ్రూ పోషించిన పాత్రను, స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాల భూమికను వివరించారు. భావితరాలకు గ్రంథాలయాలు ఓ దిక్సూచి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి గ్రేడ్–1 గ్రంథాలయాధికారి జె.శివప్రసాద్, జెడ్పీ, ఎంజీఎం హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు వంశీరాజు, కె.రవి, టీచర్లు దుర్గ, లత, వెంకట, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తహసున్నీసా బేగం, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

దామలచెరువులో..

పాకాల: మండలంలోని దామలచెరువు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పున్నాగు మురళీబాబు ప్రారంభించారు. గ్రంథాలయం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈఓ యుగంధర్, నాయకులు రఘునాయుడు, చిన్నబ్బనాయుడు, లక్ష్మీపతినాయుడు, బాబునాయుడు, నాసిర్, సుధాకర్‌నాయుడు, ఘని, రంగప్రసాద్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


చంద్రగిరి: జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ...

చంద్రగిరిలో..


చంద్రగిరి: స్థానిక పాతపేటలోని గ్రంథాలయంలో వారోత్సవాలను ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతోపాటు గ్రంథాలయ అధికారిణి రెడ్డెమ్మ మాట్లాడారు.

పక్కాగా ఇంటింటా సర్వే చేయండి


హౌస్ హోల్డ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ


తిరుపతి రూరల్: ఇంటింటికీ వెళ్లి హౌస్ హోల్డ్ సర్వేను పక్కాగా చేయాలని తిరుపతి రూరల్ ఎంపీడీఓ రామచంద్ర ఆదేశించారు. గురువారం మండలంలోని వేదాంతపురం, ఓటేరు పంచాయతీల్లో చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం వేదాంతపురం పంచాయతీలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను మరింత పెంచాలని సూచించారు. రజక దోబీ ఘాట్ వద్ద మౌలిక వసతులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఓటేరు సచివాలయంలో రికార్డులను పరిశీలించారు.

అవగాహనతో క్యాన్సర్ నివారణ


సర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు

చంద్రగిరి: మహమ్మారి క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందితే వ్యాధి బారిన నుంచి విముక్తి పొందవచ్చని కొటాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక అన్నారు. గురువారం కొటాల సచివాలయంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటి సర్వే ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ గంగులమ్మ, సెక్రటరీ మధు, ఎంపీహెచ్‌ఈఓ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మధుమేహ శిబిరానికి స్పందన


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ హరినాథ రెడ్డి

తిరుపతి తుడా : మధుమేహ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని తిరుపతిలోని హర్షిత హాస్పిటల్లో గురువారం మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 110 మందికి వైద్య పరీక్షలు చేసి నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హరినాథరెడ్డి మాట్లాడారు. మధుమేహం రోగులు తీసుకోవాల్సిన ఆహారం, పాదాల సంరక్షణపై జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ మహాదేవరావు, డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ నికిత, ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోరూ!

–ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్న తిరుపతి రూరల్ సీఐ

తిరుపతి కల్చరల్: పాతకాల్వ, పేరూరు గ్రామ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 197/1లోని తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితురాలు పద్మజ విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన భర్త మాజీ సైనికుడని, అతనికి వచ్చిన రిటైర్‌మెంట్ డబ్బుతో 2018లో ఆ సర్వే నంబర్‌లో 63 సెంట్ల భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, అయితే పాతకాల్వకు చెందిన కల్పన తమ భూమిని ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించిందని, తమ భూమితో పాటు మరో 14 మందికి చెందిన స్థలాలను సైతం ఆమె ఆక్రమించుకుందని, దీనిపై తాము ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తోందన్నారు. దీనిపై తిరుపతి రూరల్ సీఐకు ఫిర్యాదు చేసినా తీసుకోకుండా ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతూ తమకు అన్యాయం చేస్తున్నారని కన్నీటి పర్యంతమైంది. రెవెన్యూ అధికారులు, పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరింది. సమావేశంలో బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

భావి భారత పౌరులుగా ఎదగాలి

తిరుపతి మంగళం : బాలలు చిన్నతనం నుంచే శ్రద్ధగా చదువుతూ, వృత్తి నైపుణ్యాలలో శిక్షణ పొంది భావి భారత పౌరులుగా ఎదగాలని బాలల న్యాయ మండలి, తిరుపతి మూడవ ప్రథమశ్రేణి న్యాయాధికారి ఎం. సంధ్యారాణి పిలుపునిచ్చారు. తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ప్రభుత్వ బాలుర గృహం, బాలుర ప్రత్యేక గృహంలో గురువారం బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. విశ్రాంత జాయింట్ డైరెక్టర్, జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ పి. సుకుమారన్, బాలల సంక్షేమ సమితి, చిత్తూరు జిల్లా సభ్యులు పి.చంద్రశేఖర్ రెడ్డి, ఎల్.కృష్ణమ నాయుడు, బాలల న్యాయ మండలి సభ్యులు ఎస్ఎన్.మంజుల, ఎ.నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్లు ఎం.షణ్ముఖరావు, యస్.త్రినాథరావు, ప్రాంతీయ పర్యవేక్షణ తనిఖీ అధికారి పి.సుదర్శన్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.మోహన్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ వి. శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరా మైదానంలో కార్తీక దీపోత్సవం నేడు

తిరుపతి కల్చరల్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఇసో ధ్యాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇందిరా మైదానంలో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సుజన, హేమంత్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అధ్యాత్మిక ప్రవచన పారాయణం, కోలాటం, కేరళ వాయిద్య కళాకారుల ప్రదర్శన ..మొదలైనవి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మైదానంలో భక్తులకు దీపాలు, పూజా సామగ్రి అందజేస్తామన్నారు. నిర్వాహకులు రవి, శాస్త్రి, శివయ్య పాల్గొన్నారు.

మార్పు చేర్పులకు క్యూ కట్టిన విద్యార్థులు



బర్త్ సర్టిఫికెట్లలో ఇంటి పేరు తప్పనిసరి కావడంతో పది, ఇంటర్ విద్యార్థులు పరుగులు పెడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ జనన మరణ విభాగంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిక్కిరిసిపోతోంది. జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు చేయాలంటే విధిగా ఆధార్, అలాగే బర్త్ సర్టిఫికెట్లలో ఇంటిపేరు ఉండాల్సిందే. అలా లేని పక్షంలో ఆన్‌లైన్ అప్లికేషన్ తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల మార్పు–చేర్పుల కోసం హైరానా పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో వీరి సౌలభ్యం కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. పది రోజులుగా 200 మందితో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కిక్కిరిసిపోతోంది.

– తిరుపతి తుడా

అన్నాభిషేకం


శ్రీఅగస్త్యేశ్వర స్వామి

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో నిర్వహిస్తున్న రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారిని శ్రీఆనందవల్లీ అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వివిధ కైంకర్యాలు నిర్వహించారు. 11.30 గంటలకు స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించి శోభాయమానంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శుక్రవారం రుద్ర పాదాల ముక్కోటి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త తెలిపారు. భక్తులు పదివేల మంది వస్తారనే అంచనాతో తగిన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

ఘనంగా బాలల దినోత్సవం


వివిధ వేషధారణలో లిటిల్ ఏంజెల్స్ బాలలు


పాకాల: నెహ్రూ, నేతాజీ తదితరుల వేషధారణలో చిన్నారులు


తిరుచానూరులో విరాళం అందజేస్తున్న హరిహర రెడ్డి




భవిత కేంద్రంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఈఓ బాలాజి తదితరులు, డాక్టర్ డి.రామానాయుడు నగర పాలక ప్రాథమిక పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విజ్‌డం క్లబ్ ఆధ్వర్యంలో భవిత విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు డీవైఈఓ కె.బాలాజి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు తహసున్నీసాబేగం, సభ్యులు డాక్టర్ గాంధీ, శివకుమారి, సుప్రజ, భవిత కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంజీఎం హెచ్‌ఎం కదిరి రవి, టీచర్లు బండి మధుసూదన్‌రెడ్డి, భవిత సెంటర్ టీచర్లు భవాని, జ్ఞానమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉయ్ సపోర్ట్ ఆధ్వర్యంలో: ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ డి.రామానాయుడు నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను డీవైఈఓ చేతుల మీదుగా అందజేశారు. ట్రస్టు సభ్యులు, హెచ్‌ఎం భానుమతి, టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా సాధికారిక ట్రస్టు ఆధ్వర్యంలో: ప్రజా సాధికారిక ట్రస్టు అధ్యక్షుడు బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో బేరి వీధిలోని నగర పాలక పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్లో..

తిరుపతి కల్చరల్: యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్లో చిన్నారులు వివిధ వేషధారణతోపాటు నృత్యాలతో అలరించారు. చైర్ పర్సన్ ఎం.రమాదేవి, స్కూల్ అధినేత కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కేఆర్.శ్వేతారెడ్డి మాట్లాడారు.

ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో..

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ మాట్లాడారు. నాయకులు పవన్, సాయి, ప్రదీప్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: స్థానిక ఎన్‌వీఎన్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఎంఈఓలు బాబ్జి, లింగయ్య, హెచ్‌ఎం మోహన్‌బాబు మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో లయన్స్‌క్లబ్ సభ్యులు జయరాంనాయుడు సౌజన్యంతో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే దామలచెరువు ఎంపీపీ పాఠశాలలో లయన్స్‌క్లబ్ సభ్యులు పుల్లూరు ఆనందయ్య, బేబీ విద్యార్థులకు స్వీట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. పాకాల, దామలచెరువు మ్యాంగోనగర్ లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తిరుచానూరులో..

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన చిల్డ్రన్స్ డేలో పాఠశాల పూర్వ విద్యార్థి హరిహర రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయడానికి ఆయన రూ.25 వేలను విరాళంగా ఇచ్చారు. హెచ్‌ఎం మురళి, ఏపీటీఎఫ్ నేతలు వెంకటముని, పీడీ పళని, సుదర్శన్, కాత్యాయని, ప్రశాంతి, కృష్ణవేణి, లక్ష్మి, తేజోవతి, జమునా రాణి పాల్గొన్నారు.